ఒకేషనల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: తెలంగాణ రాష్ట్రంలో పారామెడికల్ సైన్సెస్‌లో పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సు అందిస్తున్న ఏకైక కేంద్రీయ విశ్వవిద్యాలయం మనూ అని అలైడ్ హెల్త్ అండ్ ఒకేషనల్ సైన్సెస్ విభాగం నోడల్ ఆఫీసర్ ప్రొఫెసర్ మక్బూల్ అహ్మద్ మంగళవారం తెలిపారు .యూనివర్శిటీలో 2023 సంవత్సరంలో మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ అండ్ మెడికల్ ఇమేజింగ్ టెక్నాలజీలో మాస్టర్ ఆఫ్ ఒకేషనల్‌ను ప్రారంభించిందన్నారు. 2024–25 విద్యాసంవత్సరానికి ఎంఎల్‌టీ, ఎంఐటీ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తోందన్నారు. దరఖాస్తులను సమర్పించడానికి జూన్ 30 ఆఖరు అని తెలిపారు. దరఖాస్తులు, ప్రాస్పెక్టస్ యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు ప్రొఫెసర్ ఎస్ మక్బూల్ అహ్మద్(9440366462), డానిష్ (9990853997) లో సంప్రదించాలన్నారు.

వేదాంతు కోచింగ్ ప్రారంభం

పంజగుట్ట: ఇప్పటివరకు ఆన్‌లైన్ విద్యలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిలిచిన వేదాంతు లెర్నింగ్ సెంటర్ ఈ సంవత్సరం నుంచి ఆఫ్‌లైన్ కోచింగ్ వైపు అడుగులు వేస్తున్నట్లు సంస్థ సహ వ్యవస్థాపకుడు, సీఈవో వంశీ కృష్ణ తెలిపారు. జేఈఈ, నీట్, ఒలంపియాడ్‌లో కోచింగ్ ఇస్తామన్నారు.

వీర జవాన్ల ఇళ్ల కూల్చివేత అన్యాయం

లిబర్టీ: ప్రాణాలను సైతం లెక్క చేయకుండా దేశ రక్షణ కోసం పనిచేస్తున్న వీర జవాన్ల ఇళ్లను కూల్చివేయడం అన్యాయమని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ అన్నారు. వీర జవాన్ల నివసించే ఇళ్లను కూల్చివేసిన వారిపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హనుమకొండలో మున్సిపల్ అధికారులు విచక్షణ లేకుండా కూల్చివేశారని ఆరోపించారు. ఇల్లు కూల్చివేయొద్దని హైకోర్టు ఆదేశించినా లెక్క చేయరా అని నిలదీశారు. కూల్చివేసిన స్థానంలోనే వీర జవాన్లకు తిరిగి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కాలువ పనులు పూర్తయితేనే..


వైశాలీనగర్-ఈర్ల చెరువు మురుగు నీటి కాలువ పనులు అసంపూర్తిగా ఉన్న దృశ్యం

హఫీజ్‌పేట్: చెరువులలో మురుగునీరు కలవకుండా ప్రత్యేకంగా చేపట్టిన మురుగునీటి కాలువ పనులు నత్తనడకన జరుగుతున్నాయి. హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని వైశాలీనగర్ నుంచి ఈర్ల చెరువు మీదుగా మదీనాగూడ వైపు సాగాల్సిన కాలువ పనులు ఏళ్లు గడుస్తున్నా ముందుకు సాగడం లేదు. పూర్తి కాకపోవడంపై కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని కాయిదమ్మకుంట నుంచి గురునాథం చెరువు వరకు 70 శాతం పనులు పూర్తికాగా, మదీనాగూడ ఈర్ల చెరువు నుంచి దీప్తిశ్రీనగర్ వరకు మురుగు నీటి కాలువల నిర్మాణం పూర్తి అయ్యాయి. కానీ వైశాలీనగర్ నుంచి ఈర్ల చెరువు వరకు చేపట్టిన పనులు పూర్తికాక పోవడంపై స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.

- సుమారు రూ.7.41 కోట్లతో మురుగునీటి మళ్లింపు కాలువ నిర్మాణ పనులు చేపట్టారు
- వర్షాకాలం ముంచుకొస్తున్న సందర్భంగా కాలువ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి
- కాలువ ఇరువైపులా సూచికబోర్డులు ఏర్పాటు చేయాలి
- మార్తాండనగర్, ప్రేమ్‌నగర్, మై హోం మంగళ నుంచి మురుగు నీరు ఈర్ల చెరువులోకి వస్తుంది. ఇక చిన్నపాటి వర్షం వస్తే చాలు రైల్వే అండర్ బ్రిడ్జి, వైశాలీనగర్‌లోకి మురుగునీరు చేరుతున్నాయి.
- దీంతో దోమల బెడద తీవ్రంగా ఉందని స్థానికులు వాపోతున్నారు.
- భారీ వరద వస్తే వైశాలీనగర్‌కు రాకపోకలు నిలిచిపోతాయని ఈ ఏడాది భారీ వర్షాలు కురుస్తాయని సూచనల మేరకు అధికారులు తొందరగా పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ముప్పు తప్పేది.!

- భారీ వర్షాలు కురిస్తే వైశాలీనగర్‌కు రాకపోకలు బంద్
- నత్తనడకన మురుగునీటి కాలువ పనులు
- వైశాలీనగర్–ఈర్ల చెరువు పనులు త్వరగా పూర్తి చేయాలి

అసంపూర్తి పనులతో ఇబ్బందులు



వైశాలీనగర్ వద్ద చేపట్టిన మురుగు నీటి కాలువ మళ్లింపు పనుల్లో ఆలస్యం జరుగుతోంది. వర్షాకాలం సమీపిస్తుండడంతో కాలువ పనులు వెంటనే పూర్తి చేయాలి.

– కుమార్, స్థానికుడు

త్వరలోనే పనులు పూర్తి చేస్తాం



మురుగు నీటి కాలువ మళ్లింపు పనులు కొంత మేర మిగిలి ఉన్నాయి. ఎప్పటికప్పుడు పనులను పరిశీలిస్తున్నా. త్వరతగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించాను.

– ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ


కాలువలో చెత్త చెదారం, చెట్ల కొమ్మలు


వైశాలినగర్ కాలువ బ్రిడ్జి వద్ద సూచిక బోర్డులు లేని దృశ్యం

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

అల్విన్‌కాలనీ: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

- వెంకటేశ్వరనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి 12.30 గంటల వరకు కమల ప్రసన్న నగర్, ఫేజ్ 1, వెంకటేశ్వరనగర్, కేఎల్ బార్ ఎదురు ప్రాంతం, వీకర్ సెక్షన్, దీనబంధుకాలనీ.
- మాధవరంనగర్ ఫీడర్ పరిధిలో మధ్యహ్నం 1.30 నుంచి 3 గంటల వరకు ఫేజ్ 1, దీనబంధు కాలనీ, మాధవరంనగర్ కాలనీ, కమలప్రసన్న నగర్.
- ఆర్‌పీకాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3.030 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రామారావునగర్, దీనబంధుకాలనీ, హనుమాన్‌నగర్, రామకృష్ణ నగర్, ఆర్‌పీ కాలనీల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలిపారు.

హబీబ్‌నగర్ ఫీడర్ పరిధిలో...

మూసాపేట: హబీబ్‌నగర్ ఫీడర్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శంకర్ తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఆంజనేయనగర్ రోడ్డు 4,5, హబీబ్‌నగర్, ప్రగతినగర్, మూసాపేట ప్రాంతాల్లో.

- కై త్లాపూర్, అంబేద్కర్‌నగర్, 15వ ఫేజులోని కొంతభాగం ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఆకాంక్ష ఫౌండేషన్ దాతృత్వం


మెడిసిన్స్, నిత్యావసరాలను అందజేస్తున్న రామారావు

కూకట్‌పల్లి: జగద్గిరిగుట్టలోని రాజీవ్ గృహకల్పలో నివసిస్తున్న రేణుక అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ విషయం తెలుసుకున్న ఆకాంక్ష ఫౌండేషన్ అధ్యక్షుడు సీహెచ్‌వీ రామారావు ఆమె నివాసానికి వెళ్లి ఆపన్న హస్తం అందించారు. ఆమెకు కావాల్సిన మెడిసిన్స్, బియ్యం, నిత్యావసరాలు, పండ్లు అందజేవారు. ఈ కార్యక్రమంలో ఆకాంక్ష ఫౌండేషన్ సభ్యులు నవీన్, రామోజీ, అనిల్, సీనియర్ జర్నలిస్టులు ఎర్ర యాకయ్య, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఫ్యూజ్‌బాక్స్


శివసేన గ్రౌండ్ వద్ద క్రిందకు ప్రమాదకరంగా ఉన్న ఫ్యూజ్ బాక్స్

మూసాపేట: భరత్‌నగర్‌కాలనీలోని శివసేన గ్రౌండ్ వద్ద విద్యుత్ ఫ్యూజ్‌బాక్స్ చేతికి అందేంత ఎత్తులో ప్రమాదకరంగా ఉంది. గ్రౌండ్‌లో చిన్నారులు ఆడుకోవటానికి నిత్యం అధికంగా వస్తుంటారు. వేసవి సెలవులు కావటంతో చిన్నారులు ఎక్కువగా గ్రౌండ్‌లోనే ఉంటారు. చిన్నారులు పొరపాటున బాక్స్‌ను తగిలే అవకాశం ఉంది. విద్యుత్ అధికారులు ముందే స్పందిస్తే ఎలాంటి ప్రమాదాలు జరగవని స్థానికులు పేర్కొంటున్నారు.

ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు


వివేకానందనగర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

విశ్వవిఖ్యాత నట సార్వభౌమ, నటరత్న, పద్మశ్రీ, మాజీ ముఖ్యమంత్రి, స్వర్గీయ డాక్టర్ నందమూరి తారక రామారావు ఎన్టీఆర్ జయంతి వేడుకలు మంగళవారం కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వివిధ పార్టీల నాయకులు, ఎన్టీఆర్ అభిమానులు నియోజకవర్గంలోని ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు జాతి కీర్తి పతాకం.. తెలుగుజాతి ఉన్నంత వరకు ఎన్టీఆర్ పేరు నిలిచి ఉంటుందని కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ మాట్లాడుతూ తెలుగువారి గుండెల్లో చెరగని ముద్ర చిరస్థాయిగా వేసుకున్న నాయకుడు ఎన్టీఆర్ అని అన్నారు., సూర్యచంద్రులు ఉన్నంత కాలం ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించిన మహానుభావుడని కొనియాడారు.

– కూకట్‌పల్లి జోన్ బృందం


వసంత్‌నగర్‌లో నివాళులర్పిస్తున్న బండి రమేష్, తదితరులు


నివాళులర్పిస్తున్న భరత్‌నగర్‌కాలనీ గుడ్‌మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

హెచ్‌ఐసీసీలో సూత్ర ఎగ్జిబిషన్ ప్రారంభం

మాదాపూర్: ప్రముఖ డిజైనర్లు రూపొందించిన వస్త్రాభరణాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని హెచ్‌ఐసీసీలో మంగళవారం సూత్ర ఫ్యాషన్ ఎగ్జిబిషన్‌ను నటి రీతు చౌదరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫ్యాషన్ ట్రెండ్‌కు అనుగుణమైన భారతీయ దుస్తులు, డిజైనర్, వెస్ట్రన్ వేర్, ఇండియన్ అప్పరల్, హ్యాండ్‌లూమ్స్, కాస్ట్యూమ్ డిజైనర్, జువెలరీతో పాటు గృహోపకరణాలు, పాదరక్షలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు ప్రదర్శన కొనసాగుతందని, ప్రదర్శనలో 70 స్టాల్స్‌కు పైగా ఉన్నాయని నిర్వాహకులు ఉమేష్ మాద్యం తెలిపారు.

కూరగాయల ధరలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి రైతు బజార్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో.. టమాట 29, వంకాయ 23, బెండకాయ 45, పచ్చిమిర్చి 50, బజ్జిమిర్చి 50, కాకరకాయ 38, బీరకాయ 35, క్యాబేజి 18, బీన్స్ 135, క్యారెట్ 37, గోబిపువ్వు 18, దొండకాయ 23, చిక్కుడుకాయ 75, గోరు చిక్కుడు 40, బీట్‌రూట్ 21, క్యాప్సికం 45, ఆలుగడ్డ 31, కీరా 18, దోసకాయ 23, సొరకాయ11, పొట్లకాయ 15, కంద 75, ఉల్లిపొరక 65, ఉల్లిగడ్డ 24, మామిడికాయ 10 నుంచి 15, అరటికాయ 8 నుంచి 9, చామగడ్డ 37, ముల్లంగి 4 నుంచి 5, చిలగడ దుంప 28, గుమ్మడికాయ 35, నిమ్మకాయలు 65 నుంచి 75, మునగకాయలు 4 నుంచి 5, బొప్పాయి 40, పుట్టగొడుగులు 40, ఎండుమిర్చి 220, అల్లం 200, వెల్లుల్లి 240, చింతపండు 120, పండుమిర్చి 80, ఉసిరి 40, వేరుశెనగ నూనె 165, పామాయిల్ నూనె 97లుగా ఉన్నాయి.

గమనిక: ఈ ధరలు బుధవారం ఉదయం 9గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

తొమ్మిదిమందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ శ్రావణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.... ఆది, సోమవారాల్లో నిర్వహించిన డ్రైవ్‌లో 09 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా, జడ్జి ఒక్కొక్కరికి రూ.2 వేల జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

శారదాంబకు విశేష పూజలు



మోతీనగర్: మోతీనగర్‌లోని శృంగేరి శారద శంకరమఠం వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం శారదాంబకు విశేష పూజలు చేశారు. గోపూజ, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం నిట్టల కిరణ్మయి ప్రవచనం చేశారు. ఈ వేడుకలు 30వ తేదీ వరకు వార్షికోత్సవాలు జరుగుతాయని ఆలయ కార్యనిర్వాహక అధికారి సీఎస్ఆర్ మూర్తి తెలిపారు.

‘తప్పుడు మూల్యాంకనం’ పై చర్యలు తీసుకోవాలి

లిబర్టీ: ఇంటర్మీడియట్ పరీక్షపత్రాల మూల్యాంకనంలో నిర్లక్ష్యంగా వ్యవహరించి తప్పుడు మార్కులు వేసిన సిబ్బంది, అధికారులపై తక్షణ చర్యలు చేపట్టాలని దళిత బహుజన విద్యార్థి సమాఖ్య తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు వలిగొండ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. తప్పుడు వ్యాల్యుయేషన్‌తో నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులు రీకౌంటింగ్‌కు ఫీజులు కట్టే పరిస్థితుల్లో లేరని పేర్కొన్నారు. ప్రశ్నాపత్రాల్లో ఇచ్చిన ప్రశ్నలకు సరైన సమాధానాలు రాసిన విద్యార్థులకు కూడా తప్పుడు మార్కులు వచ్చాయని విచారం వ్యక్తం చేశారు. నష్టపోయిన విద్యార్థులకు న్యాయం జరగని పక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా వీర్ సావర్కర్ జయంతి


వివేకానందనగర్ సెంటర్‌లో వీర్ సావర్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

అల్విన్‌కాలనీ: మాతృభూమి కోసం మరణం కూడా జననం లాంటిదని చాటి చెప్పిన నాయకుడు, హిందుత్వ సిద్ధాంతకర్త వినాయక్ దామోదర్ వీర్ సావర్కర్ అని అన్నారు. మంగళవారం అల్లాపూర్ డివిజన్‌లోని వివేకానందనగర్ సెంటర్‌లో వీర్ సావర్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అల్లాపూర్ డివిజన్ అధ్యక్షుడు విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి బొంత హరికృష్ణ,అంకిత్ సింగ్, శ్రావణ్, సుదర్శన్ ముదిరాజ్, వెంకటరామిరెడ్డి, ఆవుల ఆంజనేయులు, దామోదర్ నేత, శ్రీనివాస్ రెడ్డి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో విద్యుత్ సమస్య లేదు


విద్యుత్ అంతరాయంపై అధికారులను అడిగి తెలుసుకుంటున్న టీపీసీసీ కార్యదర్శి గాలి బాలాజీ

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీలో అప్రకటిత విద్యుత్ కోతలు, సమస్యలపై డీఈ ఆపరేషన్ కొండాపూర్ డీజీఎం రాజుతో మంగళవారం టీపీసీసీ కార్యదర్శి గాలి బాలాజీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గాలి బాలాజీ కరెంటు కోతపై ప్రజలకు వివరణ ఇచ్చారు. గతేడాది విద్యుత్ శాఖ నిర్వహణ పనులకు అనుమతి ఇవ్వలేదని.. దీని కారణంగా చెట్టు కొమ్మలు, ఫ్యూజ్ వైర్లు, పోల్స్ వంటి పనుల నిర్వహణ జరగలేదని అధికారులు తెలిపారన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నిర్వహణ పనులపై దృష్టి పెట్టిందన్నారు. మరమ్మతుల కారణంగా అప్పుడప్పుడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. అంతేకాని రాష్ట్రంలో విద్యుత్ సమస్య లేదని తెలిపారు.

- కూకట్‌పల్లి ప్రజలకు విద్యుత్ సరఫరాపై ఉన్న అపోహలను తొలగించటానికే అధికారుల నుంచి నిజమైన వివరణ తీసుకుంటున్నామని అన్నారు.

అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని ఇది ప్రజా ప్రభుత్వమని వివరించారు. విద్యుత్ శాఖను సమర్థవంతంగా నడిపిస్తున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, అధికారులకు అభినందనలు తెలియజేస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో కేపీహెచ్‌బీ డివిజన్ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, పొడుగు అప్పారావు, దొడ్డి రంగస్వామి, పీఆర్ నాయుడు, ఫణీంద్ర, బచ్చు మల్లి, బాబ్జి, పిడికిటి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

చెస్ ఆడుతూ.. చైతన్య పరుస్తూ.!

చెత్త వేయొద్దని జీహెచ్ఎంసీ వినూత్న కార్యక్రమం


నిత్యం చెత్త వేసే ప్రాంతాన్ని శుభ్రం చేసి స్థానికులతో చెస్ ఆడుతున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

మూసాపేట: ఎక్కడపడితే అక్కడ చెత్త వేయొద్దనే ఉద్దేశంతో జీహెచ్ఎంసీ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నిత్యం చెత్త వేసే ప్రాంతాలను గుర్తించి అక్కడ మళ్లీ ఎప్పుడూ చెత్త వేయకుండా ఉండేందుకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మూసాపేట డివిజన్ పరిధిలోని గూడ్స్‌షెడ్ రోడ్డులోని రెండు జీవీపి పాయింట్ల వద్ద జీహెచ్ఎంసీ సిబ్బంది స్థానికులతో చెస్ ఆడుతూ ఆడారు. ఇది చెత్త వేసే ప్రాంతం కాదని... ఇలా శుభ్రంగా ఉంటే బస్తీ, కాలనీల రోడ్లు అందంగా కనిపిస్తాయన్నారు. మహిళా సంఘాల సమాఖ్య సభ్యులు ముగ్గులు వేసి చెత్త వేయొద్దని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పీలు, శానిటేషన్ సూపర్‌వైజర్లు,కార్మికులు, కమ్యూనిటీ ఆర్గనైజర్ మురళి, గాయత్రి,శ్రావణి,మాలశ్రీ, ఊర్మిళ, వి.రాజేశ్వరి, టి.రాజేశ్వరి,చందన,జ్యోతి పాల్గొన్నారు.

పార్టీ నిబంధనలు ఉల్లంఘిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవు

కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్


బాలానగర్‌లోని పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న బండి రమేష్

బాలానగర్: పార్టీ నియమ నిబంధనలు ఉల్లంఘిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ హెచ్చరించారు. కొందరు నాయకులు పార్టీ పేరు చెప్పి వసూళ్ల దందాకు తెర లేపారనే విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి వారిపై పార్టీ క్రమశిక్షణ చర్యలు తీసుకుంటుందన్నారు. పార్టీ నుంచి సస్పెండ్ చేయడానికి సైతం వెనుకాదని స్పష్టం చేశారు. ప్రజాపాలన, అభివృద్ధి, సంక్షమమే ధ్యేయంగా సీంఎ రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. మంగళవారం బాలానగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గంలో చేపట్టే పనుల గురించి వివరించారు.

చెరువులను కాపాడి అభివృద్ధి చేస్తాం..

జేఎన్‌టీయూ, హైటెక్ సిటీ రహదారిలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి మెట్రో రైల్, స్కై బస్సు ఏర్పాటు చేయాలని సీఎం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని చెరువులను కబ్జాదారుల నుంచి కాపాడి, వాటిని అభివృద్ధి చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి నియోజకవర్గ అభివృద్ధికి రూ.10కోట్లు కేటాయించిందన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ఆ నిధులను రోడ్లు, పాఠశాలల అభివృద్ధికి వినియోగిస్తామన్నారు. త్వరలో కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ చేస్తామని తెలిపారు. కూకట్‌పల్లి నియోజకవర్గ ప్రజలకు ఎవరికైనా ఎటువంటి సమస్య ఉన్నా ఫోన్ నం.9849001133లో సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మయ్య, నాగిరెడ్డి, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, కొప్పిశెట్టి దినేష్ తదితరులు పాల్గొన్నారు.

చేప పిల్లలు వచ్చేనా..!

- వర్షాకాలం సమీస్తున్నా జాడలేని టెండర్లు
- ఉచిత చేప పిల్లల పంపిణీపై నీలి నీడలు
- గతేడాది 352 చెరువుల్లో 91 లక్షల చేప పిల్లల పంపిణీ



సాక్షి,మేడ్చల్ జిల్లా : మత్స్యకారులకు ఆర్థిక తోడ్పాటును ఇచ్చేందుకు గత ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేసింది. ఈ ఏడాది చేపపిల్లల పంపిణీ పథకం కొనసాగింపుపై ప్రస్తుత ప్రభుత్వం ఇంకా స్పష్టత ఇవ్వకపోవటంతో నీలి నీడలు అలుముకుంటున్నాయన్న అనుమానాలను మత్స్య సంఘాలు వ్యక్తం చేస్తున్నాయి.

- ప్రతి ఏటా వర్షాకాలానికి ముందే చేప పిల్లల కోసం టెండర్లు పిలవాల్సి ఉంటోంది.

అలా.. చేస్తేనే చెరువులు నిండే అదను వరకు చేప పిల్లల పంపిణీ సాధ్యమవుతుంది. ఆలస్యమైతే మాత్రం చేప పిల్లలను చెరువుల్లో పంపిణీ చేయడం అసాధ్యమని మత్స్య సహకార సంఘాలు చెబుతున్నాయి.

ఊసేలేని టెండర్లు

గతంలో చేపపిల్లల సరఫరాకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ మే నెలలో మొదలై.. ముగిసేవి. కాంట్రాక్టర్లు కూడా సీజన్ మొదలయ్యే లోపే చేప పిల్లలను జిల్లాకు చేర్చి, నిండిన చెరువుల్లో 100 శాతం ఉచితంగా వదలడంతో వాటి ఎదుగుదల బాగుండేది.

మే నెలాఖరు పూర్తవుతున్నా...

చేపపిల్లల పంపిణీపై రాష్ట్ర మత్స్యశాఖ స్పష్టత ఇవ్వటం లేదని మత్స్య సహకార సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. సంబంధిత మంత్రిత్వ శాఖ నుంచి కూడా ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం లేదని పేర్కొంటున్నారు. ఈ సందర్భంగా జిల్లా మత్స్యశాఖ అధికారి మాట్లాడుతూ.. చేప పిల్లల టెండర్ల విషయంపై ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని చెప్పారు. ప్రభుత్వ నోటిఫికేషన్ విడుదల చేస్తేనే.. జిల్లాస్థాయిలో చేప పిల్లలకు సంబంధించిన ప్రక్రియ మొదలవుతుందని, దీనికోసమే ఎదురుచూస్తున్నట్లు పేర్కొన్నారు.

అదను దాటితే.. అంతే...

అదను దాటిన తర్వాత చేప పిల్లలను చెరువుల్లో వదిలితే.. వాటి ఎదుగుదల సరిగ్గా ఉండదు. ఆగస్టు, సెప్టెంబరు రెండోవారంలోపే చేప పిల్లల పెంపకాన్ని మొదలుపెట్టాల్సి ఉంటోంది. అప్పుడే చేపల ఉత్పత్తి బాగా ఉంటోంది. లేదంటే ఏ రకమైనా చేపైనా సరే.. బరువు అంతంత మాత్రమే ఉంటుందని మత్స్య సంఘాలు పేర్కొంటున్నాయి. ఒకవేళ ప్రభుత్వానికి చేపపిల్లలను పంపిణీ చేసే ఉద్దేశం ఉన్నా.. ఆలస్యం కారణంగా కాంట్రాక్టర్లు నాసిరకం చేపపిల్లలను మత్స్యకారులకు అంటగట్టే అవకాశం ఉంటోందని పేర్కొంటున్నాయి. ఈ విషయాన్ని మత్స్యశాఖ ఉన్నతాధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సకాలంలో చేప పిల్లలకు సంబంధించిన టెండర్లు నిర్వహించేలా చూడాలని సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.

గతేడాది 91 లక్షల ఉచిత పిల్లల పంపిణీ

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 62 ప్రాథమిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల ఆధ్వర్యంలో 352 చెరువుల్లో ఉచితంగా 91 లక్షల చేప పిల్లలను మత్స్య శాఖ పంపిణీ చేసింది. ఈ చేప పిల్లలలో పెద్ద సైజు (80–100 ఎం.ఎం.) 13.50 లక్షలు కాగా, చిన్న సైజు చేప పిల్లలు (40–45 ఎంఎం) 77.50 లక్షలు ఉన్నట్లు మత్స్యశాఖ ప్రకటించింది.